# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-05-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **వైఎస్సార్ కడప జిల్లాలో ఈరోజు నుంచి ప్రారంభమవుతున్న టిడిపి మహానాడులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారు.**
2. **భూమి లేని నిరుపేదలకు ఏడాదికి 12 వేల రూపాయలు ఇస్తున్నామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.**
3. **దేశవ్యాప్తంగా కోవిడ్ కేసుల తీవ్రత తక్కువగానే ఉందని భారతీయ వైద్య పరిశోధనా మండలి–ఐసిఎమ్ఆర్ వెల్లడించింది.**
4. **ఆంధ్రప్రదేశ్‌లో ఆయుష్ ఆధారిత పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.**
5. **తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ–టీపీసీసీ కార్యవర్గ ప్రకటన త్వరలో ఉంటుందని ఆ పార్టీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వైయస్సార్ కడప జిల్లాలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా తెలుగు దేశం పార్టీ మహానాడు కార్యక్రమంలో ఈ రోజు పాల్గొంటారు. 'సుస్థిర ప్రభుత్వంతోనే స్వర్ణాంధ్ర కల సాకారం' అనే ఇతివృత్తంతో 3రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుంది. మహానాడులో టీడీపీ భవిష్యత్ లక్ష్యాలకు అనుగుణంగా ఆరు ప్రధాన అంశాల ప్రాతిపదికగా చర్చించనున్నారు. కార్యకర్తే అధినేత, యువగళం, తెలుగుజాతి–విశ్వఖ్యాతి, స్త్రీ శక్తి, సామాజిక న్యాయం–పేదల ప్రగతి, అన్నదాతకు అండ అనే అంశాలపై చర్చలు, తీర్మానాలు ఉంటాయని పార్టీ వర్గాలు తెలిపాయి మహానాడులో భాగంగా ముఖ్యమంత్రి మై టీడీపీ యాప్ ను సభలో ఆవిష్కరించి... ప్రారంభోపన్యాసం చేస్తారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

--------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సౌర ఫలకాల తయారీని ప్రోత్సహించేందుకు సమగ్ర విధానాన్ని అభివృద్ధి చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్రంలో సౌర ఉత్పత్తుల తయారీ రంగం పరిణామాలపై ఒక పత్రిక రాసిన కథనంపై ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రభుత్వ ప్రోత్సాహకాల ఫలితంగా దేశంలోనే ఆంధ్రప్రదేశ్ సౌర ఉత్పత్తుల రంగంలో పెద్ద కేంద్రంగా నిలవనుందని చెప్పారు. రాష్ట్రానికి మరింత మంది పెట్టుబడిదారులను ఈ రంగంలోకి ఆహ్వానించడం వల్ల దేశాన్ని హరిత

ఇంధనం వైపు మళ్లించడంతోపాటు ప్రజల కోసం లక్షల ఉద్యోగాలు సృష్టించనున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

భూమి లేని నిరుపేదలకు ఏడాదికి 12 వేల రూపాయలు ఇస్తున్నామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా పోల్కంపల్లి, బొమ్మంపల్లి, పదరలలో ఏర్పాటు చేసిన విద్యుత్ ఉప కేంద్రాలను ఆయన హైదరాబాద్ నుంచి దృశ్య మాధ్యమం విధానంలో నిన్న ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 12 వేల కోట్ల రూపాయలతో ఇటీవల నల్లమల డిక్లరేషన్ ప్రకటించామన్నారు. ఉద్యోగులకు గత ప్రభుత్వ బకాయిలను క్రమంగా చెల్లిస్తున్నామని పేర్కొన్నారు.

---------------------------

దేశవ్యాప్తంగా కోవిడ్ పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని భారతీయ వైద్య పరిశోధనా మండలి–ఐసీఎమ్ఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహల్ తెలియజేశారు. కోవిడ్ కేసులు పెరుగుతున్నప్పటికీ కరోనా కొత్త వేరియంట్ల పట్ల భయాందోళనలు అవసరం లేదన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రాథమిక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దేశంలో కేసుల తీవ్రత తక్కువగానే ఉందని ఆయన వివరిస్తూ...

వాయిస్ ...35 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఆయుష్ ఆధారిత పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ తెలిపారు. తమిళనాడులోని ఆయుష్ మంత్రిత్వ శాఖ చెన్నైలో నిర్వహించిన దక్షిణాది రాష్ట్రాల మంత్రులు, అధికారుల రెండవ ఆయుష్ సదస్సులో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆయుష్‌ను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, తదనుగుణంగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశామని చెప్పారు. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకుల్ని ఆకర్షించడంతో పాటు వారికి మెరుగైన ఆరోగ్యాన్ని అందించేందుకు కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ సహకారంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త పర్యాటక విధానానికి రూపకల్పన చేసిందని మంత్రి వివరించారు.

---------------------------

అఖండ గోదావరి ప్రాజెక్టుకు జూన్ మొదటివారంలో ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేస్తారని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడారు. మొదటి దశలో టెండర్లు పూర్తయ్యాయని, ప్రాజెక్టుకు 97కోట్ల రూపాయల ఖర్చు అవుతుందని అంచనా వేశామన్నారు. 2027 నాటికి ప్రాజెక్టు పూర్తవుతుందని తెలిపారు. అఖండ గోదావరి, గండికోట ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు.

---------------------------

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ–టీపీసీసీ కార్యవర్గ ప్రకటన ఒకట్రెండు రోజుల్లో ఉంటుందని ఆ పార్టీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన.. కాంగ్రెస్ నాయకులు రాహుల్

గాంధీతో నిన్న సమావేశమయ్యారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. మంత్రి వర్గంలో బీసీలకు తగిన ప్రాతినిధ్యం ఉండాలని కోరినట్లు చెప్పారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, జై బాపు, జై భీమ్ కార్యక్రమాల గురించి వివరించామని ఆయన తెలియజేస్తూ,

వాయిస్..27 సెకను

---------------------------

ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడానికి పాకిస్తాన్ చేస్తున్న ప్రయత్నాలను భారతదేశం ప్రపంచవ్యాప్తంగా బహిర్గతం చేస్తోంది. అఖిలపక్ష బృందాల ప్రతినిధులు పలు దేశాలను సందర్శించి, జీరో టోలరెన్స్ విధానమే ఉగ్రవాదం పట్ల భారతదేశపు వైఖరి అని స్పష్టం చేస్తోంది. ఇందులో భాగంగా జెడియు పార్టీ పార్లమెంట్ సభ్యులు సంజయ్ కుమార్ ఝా నేతృత్వంలోని అఖిలపక్ష ప్రతినిధి బృందం నిన్న దక్షిణ కొరియాలోని సోల్ నగరంలో పలువురితో సమావేశమయ్యింది. పహల్గామ్ ఉగ్రవాద దాడిని ఉటంకిస్తూ గత 40 సంవత్సరాలుగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడమే పాకిస్తాన్ జాతీయవిధానంగా కొనసాగుతోందని పేర్కొంది.

---------------------------

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కమినిలంక వద్ద గోదావరిలో 8 మంది యువకులు గల్లంతయ్యారు. కె.గంగవరం మండలం శురుల్లంకలో గత సాయంత్రం 11 మంది యువకులు స్నానం కోసం గోదావరి నదిలో దిగారు. లోతైన ప్రాంతం కావడంతో 8 మంది గల్లంతుకాగా.. ముగ్గురు సురక్షితంగా బయటకు వచ్చారని అధికారులు తెలిపారు. గల్లంతైన యువకుల కోసం పోలీసులు, స్థానికులు గాలింపు చర్యలు చేపట్టారు.

---------------------------

గోదావరి నదిలో యువకులు గల్లంతుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కోనసీమ జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. గల్లంతైన వారిని రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరోవైపు జిల్లా కలెక్టర్ నుంచి ఘటనకు సంబంధించిన వివరాలను ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అడిగి తెలుసుకున్నారు. గల్లంతైన యువకుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని అధికారుల్ని ఆదేశించారు.

---------------------------

భారతదేశ తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర్య పోరాటంలో జాతిపిత మహాత్మాగాంధీతో పాటు ప్రముఖపాత్ర వహించిన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి ఈరోజు. తొలి ప్రధానమంత్రిగా దేశ పురోగతికి ఆయన పటిష్ఠమైన పునాది వేశారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను ప్రజలు స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని రాయలసీమ ప్రాంతాల్లోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయని మిగతా ప్రాంతాలకు విస్తరించేందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది.

దీని ప్రభావంతో రాష్ట్రంలో  ఈరోజు భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని  వాతావరణ శాఖాధికారి ఎం. వెంకటరావు వెల్లడిస్తూ ...

వాయిస్ ..30 సెకన్లు

ఉత్తర తెలంగాణపై ద్రోణి కొనసాగుతున్న నేపథ్యంలో తెలంగాణలో  గురువారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం  తెలిపింది.

======================